సాక్షి వికారాబాద్

సోమవారం : 3 : జూలై : 2023



గుర్తింపు లేదు

సీఎం కేసీఆర్ పాలనలో ముదిరాజ్‌లకు గుర్తింపు లేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి ముదిరాజ్ విమర్శించారు. 8లో▸



ఆహ్లాదం.. బహుదూరం!

ప్రజలకు ఆహ్లాదమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు అధ్వానంగా మారాయి. 8లో▸



సమస్యల ఒడిలో..

పెద్దేముల్ మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

రైతుబంధు దరఖాస్తుకు ఆఖరు నేడే

దౌల్తాబాద్: కొత్తగా పట్టా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం సోమవారంతో ముగియనుందని మండల వ్యవసాయధికారి తిప్పేస్వామి తెలిపారు. కొత్త పాసుపుస్తకాలు పొందినవారు పట్టాదారుపుస్తకం, బ్యాంకు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ సంబంధిత ఏఈఓలకు అందజేయాలని సూచించారు. గడువులోగా దరఖాస్తు చేసుకున్న వారికి రైతుబంధు సాయం అందుతుందని తెలిపారు.

వీడని మృత్యువు

- నెల రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



శంకర్‌నాయక్(ఫైల్)

ధారూరు: దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని స్వగ్రామానికి వెళ్తుండగా జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి 29 రోజుల పాటు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి.. ఆదివారం తుదిశ్వాస విడిచాడు. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని రాంపూర్‌తండాకు చెందిన ముడావత్ శంకర్‌నాయక్(55) జూన్ 3న ధారూరు నుంచి బైక్‌పై వెళుతుండగా గట్టెపల్లి బస్టేజీ రోడ్డు మలుపులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలైన అతన్ని వెంటనే తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలో శనివారం రాత్రి ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచాడు. మృతుని కుమారుడు రుక్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు గురుపౌర్ణమి

బొంరాస్‌పేట: గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సంగమేశ్వర భక్త సమాజం ఆవరణలో ఉదయం 9గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లాకు కొత్త అధికారులు

వికారాబాద్: జిల్లా నూతన అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా లింగ్యానాయక్, జిల్లా రెవెన్యూ అధికారిగా తిరుపతిరావును నియమిస్తూ ఆదివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా నుంచి తిరుపతిరావును, మేడ్చల్ నుంచి లింగ్యానాయక్‌ను వికారాబాద్‌కు కేటాయించారు.

గిరిజన బతుకుల్లో బీఆర్‌ఎస్ వెలుగులు



జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న పట్నం

బొంరాస్‌పేట: ఆదివాసీలు, గిరిజన బతుకుల్లో బీఆర్‌ఎస్ పార్టీ వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నూతన గిరిజన గ్రామ పంచాయతీలైన మూడుమామిళ్లతండా, బాపన్‌చెర్వుతండాల్లో పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరిన్ని పనులకు హామీలిచ్చారు. మూడు మామిళ్లతండాలో రూ.20 లక్షలతో నిర్మించనున్న జీపీ భవనానికి శంకుస్థాపన చేసి, అంగన్‌వాడీ భవనం మంజూరుకు హామీ ఇచ్చారు. మూడు మామిళ్ల తండా, డీప్లానాయక్‌తండాల్లో ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేస్తానని ప్రకటించారు. వెంకట్‌నాయక్ తండాకు 2కి.మీ. బీటీ రోడ్డు, పటేల్‌చెర్వు కట్ట కింద రోడ్డుకు రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఇందుకు సంబంధించిన టెండర్ సైతం పూర్తయ్యిందని తెలిపారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని స్పష్టంచేశారు. అనంతరం ఇటీవల రేగడిమైలారంలో కరెంట్‌షాక్‌తో మృతిచెందిన నవీన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మణ్‌నాయక్, బద్యానాయక్, ఎంపీపీ హేమీబాయి, విష్ణువర్ధన్‌రెడ్డి, శేరినారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, దేశ్యానాయక్, రాముినాయక్, ఎంపీటీసీ జగదీశ్వర్, గోవింద్‌రెడ్డి, శ్యామలయ్యగౌడ్ పాల్గొన్నారు

వానమ్మ అలక వీడదే..

- అదును దాటుతున్నా పత్తా లేని వర్షాలు
- మూడు కార్తెలు ముగుస్తున్నా నేల తడవని వైనం
- ముందుకు కదలని పంటల సాగు
- ఆందోళనలో రైతులు



తాండూరు: ఆదివారం సాయంత్రం ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు

వికారాబాద్ అర్బన్: వర్షాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా సరైన వానలు కురవక రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఎనభై శాతం వ్యవసాయం వర్షాధారితమే. సకాలంలో వానలు కురవకపోతే రైతులు ఆశగా ఆకాశం వైపు చూడాల్సిందే. ఈసారి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో విత్తనాలు వేయడం కూడా ఆలస్యమవుతూనే ఉంది. వారం రోజుల క్రితం కురిసిన ఒకటి రెండు వానలు తప్ప వేసిన పంటలకు సరిపడా వర్షం పడలేదు. మరోవైపు విత్తనాలు నాటుకునేంతగా నేల తడవకపోవడంతో సాగు ముందుకు కదలడం లేదు. రోహిణి, మృగశిర, ఆరుద్ర కార్తెల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతమే నమోదైంది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులపై ఆశాఖ దృష్టిసారించింది. వర్షాధార భూములపై గ్రామాల వారీగా సర్వే నిర్వహించి నెల రోజుల క్రితమే ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది.

రుతుపవనాల ఆలస్యం

జిల్లాలో వానాకాలం సాగు విస్తీర్ణం 4,17,723 ఎకరాలు కాగా ఇందులో 80శాతం వరకు వర్షాధారిత భూములేనని సర్వేలో గుర్తించారు. ప్రతీ గ్రామానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. జూన్ మొదటి వారం నుంచి కూడా వర్షాలు పెద్దగా కురవలేదు. రుతుపవనాల రాక ఆలస్యం, ఎలినినో ప్రభావం, సాధారణం కంటే లోటు వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో చెరువులు, బావులు, చెక్ డ్యామ్‌లు, బోరుబావులు, కుంటల కింద సాగవుతున్న భూములు, వర్షాధారంగా సాగవుతున్న భూముల వివరాలను అధికారులు ముందుగానే నిర్ధారించారు. ముందుముందు ఎలాంటి విపత్తులు ఎదురైనా రైతులకు నష్టం కలగకుండా నివారించేందుకు తగిన చర్యలు తీసుకునే దిశగా చర్యలు చేపడుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వానాకాలం సీజన్‌ను 45 రోజులు పాటు ముందుకు జరపాలని కూడా నిర్ణయించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే విత్తనాలు వేయడం ఇంకా ముందుకు సాగడం లేదు. ఇదే పరిస్థితి నెలకొంటే పంటల సాగుపై రైతులకు వ్యవసాయ అధికారులు ముందస్తుగా పలు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

సాగు భూమి	ఎకరాల్లో
మొత్తం	6,00,746
వర్షాధారం	4,17,723
బోర్ల కింద	1,30,489
బావుల ద్వారా	1,1,046
కాల్వల ఆధారంగా	5,356
చెరువుల కింద	36,150

ఇలాగే ఉంటే స్వల్పకాలిక పంటలు

ఈసారి జూన్ చివరి వారంలో రుతుపవనాలు విస్తరించినా ఆశించిన మేర నేల వానలు పడలేదు. దీంతో సాగు పనులు మందగించాయి. మన జిల్లాలో రైతులు ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, కంది, వరి, జొన్న తదితర పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. ఎక్కువ మంది పత్తి వైపు మొగ్గు చూపుతారు. బావులు, బోర్లు, చెరువులు, కుంటల కింద పొలాలు ఉన్నవారు వరి వేస్తారు. అయితే జూన్ మాసం చివరి వరకు ఆశించిన మేర వానలు కురవలేదు. వారం రోజుల క్రితం కురిసిన జల్లులకు కొద్ది మంది రైతులు పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము తదితర నాటారు. ప్రస్తుతం ఇవి కూడా ఎండుముఖం పడుతున్నాయి. వ్యవసాయ అధికారుల సూచన ప్రకారం విత్తనాలు వేసేందుకు ఈ నెల 10 వరకు అవకాశం ఉన్నా, ఆలోపైనా వర్షం కురుస్తుందా..? లేదా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. తక్కువ వర్షపాతం నమోదైతే స్వల్పకాలిక రకాలైన పప్పుదినుసులు, చిరుధాన్యాలు, ఇతరత్రా తక్కువ కాలంలో చేతికి వచ్చే పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

15వరకు నాటుకోవచ్చు



జూన్ మాసం ముగిసినా ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. జిల్లాలోని 6 లక్షల ఎకరాల సాగు భూమిలో 4లక్షలకు పైగా ఎకరాలు వర్షాధారితమే. ఈ నెల 10 నుంచి 15వరకు వర్షాలు కురిసినా విత్తనాలు నాటుకోవచ్చు. లోటు వర్షపాతం నెలకొంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

– గోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



రోదిస్తున్న మృతుడి భార్య, కూతురు, కుటుంబ సభ్యులు

తుఫాన్‌తో ఢీకొట్టి.. కిలోమీటర్ ఈడ్చుకెళ్లి

- భూ తగాదాలు, రాజకీయ కక్షల నేపథ్యంలో వ్యక్తి దారుణ హత్య
- బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనకనుంచి ఢీకొట్టిన నిందితులు
- కారు ముందు భాగంలో ఇరుక్కుపోయిన వ్యక్తిని 900 మీటర్ల దూరం లాక్కెళ్లిన వైనం
- ఆస్పత్రికి తరలిస్తుండగా బీఆర్‌ఎస్ నాయకుడు మృతి



మృతుడు విఠల్

మోమిన్‌పేట: భూ తగాదాలు, రాజకీయ, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన ఆదివారం మోమిన్‌పేటలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లచ్చనాయక్‌తండాకు చెందిన మెగావత్ విఠల్(40) ఆదివారం ఉదయం తన భార్య అనితను బైక్‌పై సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బూర్గుపల్లి సమీపంలోని సీఎన్‌జీ పంపు వద్దకు రాగానే వెనుకనుంచి అతివేగంగా వచ్చిన తుఫాన్ (కేఏ 06బి 9514) వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న అనిత ఎగిరి కిందపడగా.. విఠల్ తుఫాన్ ముందు భాగంలో ఇరుక్కుపోయాడు. అయినప్పటికీ కారు ఆపకుండా సుమారు 900 మీటర్ల దూరం అలాగే ఈడ్చుకెళ్లడంతో విఠల్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. అక్కడున్న వారు గమనించి అతన్ని 108 వాహనంలో సంగారెడ్డి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచాడు. ఇదిలా ఉండగా వీరి గ్రామానికే చెందిన మెగావత్ మోతీలాల్‌కు.. మృతుడు విఠల్‌కు భూ తగాదాలు ఉన్నాయి. పాత కక్షల నేపథ్యంలో మోతీలాల్ మేనల్లుడు జైపాల్, సోదరులు నరేందర్, పవన్.. సదాశివపేట నుంచి తుఫాన్ వాహనంతో తమ బైక్‌ను వెంబడించారని మృతుడి భార్య అనిత తెలిపారు. వీరిలో జైపాల్ వాహనం నడపగా.. మిగిలిన ఇద్దరూ అందులో కూర్చున్నారు. అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతునికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బైక్‌ను ఢీ కొట్టిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందుతులు జైపాల్, నరేందర్, పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా, మృతుడు విఠల్ బీఆర్‌ఎస్‌లో క్రియాశీల నాయకుడిగా పనిచేస్తుండగా.. మోతీలాల్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నాడు. వీరి మధ్య రాజకీయ వైరం సైతం నడుస్తున్నట్లు తెలిసింది.

మృతదేహంతో పీఎస్ ఎదుట ఆందోళన

విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తమకు న్యాయం చేయాలంటూ విఠల్ మృతదేహంతో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. కొంతమంది కాంగ్రెస్ నాయకుల అండదండలతోనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎస్పీ సత్యనారాయణ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు నిరసన విరమించారు.

వీరశైవుల అభ్యున్నతికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న వీరశైవ సమాజ నూతన కార్యవర్గం

- ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- అట్టహాసంగా సమాజ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తాండూరు టౌన్: వీరశైవ సమాజాభివృద్ధికి తోడ్పాటునందిస్తామని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వీరశైవ కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన సమాజ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తాండూరు వీరశైవ కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మాణానికి గాను తన వంతు సహాయం అందజేశానన్నారు. భవిష్యత్‌లో సైతం తాను సమాజానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రుద్రభూమిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు అందజేశానని, అలాగే కల్యాణ మండపానికి రోడ్డు నిర్మిస్తానని తెలిపారు. బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. వీరశైవ సమాజం ఎంతో బలోపేతమైందన్నారు. సమాజాన్ని ఓబీసీలో కలిపేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సమాజ గౌరవాధ్యక్షులు వాలి శాంతుకుమార్, అధ్యక్షులు ఆర్.బస్వరాజ్, ఉపాధ్యక్షులు భద్రన్న, కార్యదర్శి లింగదల్లి రవికుమార్, సహాయ కార్యదర్శి సంపత్ కుమార్, కోశాధికారి వాలి శ్రావణ్ కుమార్‌లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులచేత ఎన్నికల అధికారి నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, వీరశైవ సమాజ నేత మహేశ్ పాల్గొన్నారు.

ముగ్గురిపై రౌడీ షీట్

యాలాల: వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులపై ఆదివారం రౌడీ షీట్ తెరిచినట్లు ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపారు. గత చరిత్ర, క్రిమినల్ కేసులను దృష్టిలో ఉంచుకుని యాలాల మండల కేంద్రానికి చెందిన కొప్పుల యాదప్ప, పాత తాండూరుకు చెందిన అబ్దుల్ మోహి, పేర్కంపల్లి గ్రామానికి చెందిన బుడగజంగం రఘుపతిపై రౌడీషీట్ ఓపెన్ చేశామని వెల్లడించారు.

కూలీ పనులకు వెళ్లి వస్తుండగా..

- ఆటోను ఢీకొట్టిన కారు
- పది మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- జాఫర్‌పల్లి సమీపంలో ప్రమాదం



పరిగిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పరిగి: కూలీలతో వెళ్తున్న ఆటోను కారు ఢీ కొట్టడంతో పది మందికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాఫర్‌పల్లి సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్, రాంరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 12మంది కూలీలు పరిగి మండల పరిధిలోని చిట్యాల సమీపంలో పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా జాఫర్‌పల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొడుతూ రోడ్డు కింది పొలాల్లో పడిపోయింది. గమనించిన స్థానికులు గాయాలైన వారిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ఉన్న రాజు, శ్రీను, పోచమ్మ, శాంతమ్మ, ఎల్లయ్య, అంజిలయ్య, తిరుమలయ్య, రాములు, రాము, వికాస్‌కు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరికి కాళ్లు విరిగాయి. తలకు బలమైన గాయాలైన శ్రీను, రాజు పరిస్థితి విషయమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. ఇదిలా ఉండగా కారుతో ఆటోను ఢీకొట్టిన వ్యక్తిని కాళ్లాపూర్ గ్రామస్తుడిగా గుర్తించారు.

హరితం.. ఆలస్యం!

- వరుణుడు ముఖం చాటేయడంతో ముందుకు సాగని కార్యక్రమం
- వర్షాకాలం ప్రారంభమై నెల దాటినా ఎక్కడి మొక్కలు అక్కడే
- ఈఏడాది లక్ష్యం 40,54,000
- ఎనభై శాతం సంరక్షించేలా ప్రణాళిక



నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

వికారాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 8వ విడత హరితహారం కార్యక్రమం ఈసారి ఆలస్యమవుతోంది. హరితహారం కోసం రెండు నెలల క్రితమే అధికార యంత్రాంగానికి ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. అటు ప్రభుత్వం ఇటు అధికారులు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ వరుణుడు ప్రతిబంధకంగా మారాడు. వాస్తవానికి జూన్ మొదటివారంలోనే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాల్సి ఉంది. కానీ జూన్ చివరి వారంలో నైరుతి రతుపనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా నైరుతి విస్తరించలేదు. దీంతో హరితహారానికి ఆటంకాలు తప్పడం లేదు.

సర్వం సిద్ధం

ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేసేందుకు శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. జిల్లాలో గతేడాది 22 ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేశారు. ఈ ఏడాది 19 శాఖలను భాగస్వాములను చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేయగా వరుణుడు మొహం చాటేయటంతో జాప్యం తప్పడం లేదు.

భారీ లక్ష్యం

2016లో హరితహారం కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సంవత్సరం 8వ విడతగా హరితహారం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాలో ఈ సంవత్సరం 40,54,000 మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. గత సంవత్సరం 38,70,705 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో 28,34,785 మొక్కలు నాటారు. ఈ సంవత్సరం దానికి మరింత అదనంగా మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

లక్ష్యఛేదనలో ఆటంకం

80శాతం వరకు మొక్కలు బతికాయని అధికారులు ప్రతి ఏడాది ప్రకటిస్తున్నారు. వాస్తానికి 50 నుంచి 60 శాతం మొక్కలను మాత్రమే సంరక్షిస్తున్నారు. కానీ ఏడాది నాటిన మొక్కల్లో 80 శాతానికిపైగా సంరక్షించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఇప్పటికే 19 ప్రభుత్వ శాఖలను ఇందులో భాగస్వాములను చేసి శాఖలవారీగా లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఖాళీ స్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లు, బంజరు భూముల్లో మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వైవిధ్యమైన మొక్కలకు ప్రాధాన్యత

ఈ సంవత్సరం హరితహారం కార్యక్రమానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మొత్తం 581 నర్సరీలలో మొక్కలు పెంచుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 15, గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో 566 గ్రామ పంచాయతీల్లో నర్సరీలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 38,30,000 మొక్కలను ఈ నర్సరీలలో పెంచుతున్నారు. టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. జీపీలకు సంబంధించి ఒక్కో నర్సరీలో 5000 చొప్పున 28,30000 మొక్కలు 15 ఫారెస్టు నర్సరీల్లో కలిపి 10 లక్షల మొక్కలు పెంచుతున్నారు. గచ్చకాయ, వెదురు, గుల్‌మోర్, రేన్‌ట్రీ, రావి, మర్రి, కానుగ, తురాయి, గార్డెనింగ్ మొక్కలు, దానిమ్మ, నిమ్మ, గోరింటాకు, తదితర మొక్కలను పెంచుతున్నారు. జిల్లాలో అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖ, మరియు గ్రామ పంచాయతీలకు 25లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 5లక్షలు, విద్యాశాఖ 11 వేలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ 9,43,500, ఉద్యానవన శాఖకు 2,లక్షలు , వ్యవసాయ శాఖకు 5 లక్షలు, తాండూరు మున్సిపాలిటీకి 70 వేలు, వికారాబాద్ మున్సిపాలిటీకి 80 వేలు, కొడంగల్ మున్సిపాలిటీకి 35 వేలు, పరిగి మున్సిపాలిటీకి 30 వేల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు.

సిద్ధంగా ఉన్నాం



హరితహారం కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో అటవీశాఖ, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలోని నర్సరీల్లో మొక్కలు రెడీగా ఉన్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ వర్షాకాలం ఆరంభంలోనే 8వ విడత హరితహారం కార్యక్రమం ప్రారంభించే విధంగా అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆదేశించారు. కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

– కృష్ణన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

సాయినాథుడి శోభాయాత్ర

తాండూరు: శ్రీ సద్గురు సాయిబాబా శోభాయాత్ర తాండూరు పట్టణంలో ఘనంగా జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ, భజన మండలి సభ్యులు ఆదివారం బాబా పల్లకీ సేవ నిర్వహించారు. భవాని మాతా దేవాలయం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర.. ప్రధాన కూడళ్ల మీదుగా శివారులోని బాబా అలయం వద్ద ముగిసింది. ఈ ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్ రాజుగౌడ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు

తాండూరు: ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముదిరాజ్‌లకు రాజకీయ పార్టీలన్నీ అవకాశం కల్పించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కాళికాదేవి ఆలయం నుంచి భారీ ర్యాలీగా కందనెల్లి జీపీఆర్ గార్డెన్ వరకు వెళ్లారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ముదిరాజ్‌లు అధికంగా నియోజకవర్గంలో ఈ వర్గం వారికే పోటీచేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

స్కూటీ అదుపుతప్పి మహిళ మృతి



శోభారాణి(ఫైల్)

మొయినాబాద్: స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడటంతో ఓ మహిళ ఘటనా స్థలిలోనే మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, అతని భార్య శోభారాణి(55) ఆదివారం ఉదయం చేవెళ్ల మండలం మల్కాపూర్‌లోని తమ కూతురు వద్దకు స్కూటీపై వెళ్లారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో తిరి గి ఇంటికి వెళ్తున్నారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై కేతిరెడ్డిపల్లి గేటు సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ రిసార్ట్స్ వద్దకు రాగానే ఎదురుగా ఏదో వాహనం వచ్చినట్లు అనిపించడంతో స్కూటీ అదుపుతప్పింది. దీంతో స్కూటీపై వెనకాల కూర్చున్న శోభారాణి ఎగిరి రోడ్డుపై పడడంతో ఆమె తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న సుధాకర్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

మీర్‌పేట: మతిస్థిమితం సరిగ్గా లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బద్యానాయక్ కథనం ప్రకారం.. కొందుర్గు మండలం విశ్వనాథపూర్ గ్రామానికి చెందిన కె.కృష్ణయ్య (37)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా కుటుంబ సభ్యులు కొంత కాలంగా మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని బంధువుల ఇంట్లో ఉంచి ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. వారం రోజుల క్రితం ఆర్‌ఎన్‌రెడ్డినగర్ బస్టాప్ వద్దకు వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో గృహిణి ఆత్మహత్య

మహేశ్వరం: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఓ గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం మండల కేంద్రంలోని అశ్విని హెయిర్‌ఆయిల్ ఆయుర్వేదిక్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వద్ద చోటు చేసుకుంది. సీఐ ముని తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్చన బన్సాల్, సంజయ్ కుమార్ బన్సాల్ దంపతులు. మహేశ్వరంలో ఉన్న అశ్విని హెయిర్‌ఆయిల్ ఆయుర్వేదిక్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులుగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అర్చన కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తితో ఆదివారం ఉదయం 10.30 గంటలకు కంపెనీ వెనుకాల కార్మికులు నివసించే క్వార్టర్స్ వద్ద ఇనుప మెట్లకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రాజ్‌కలి బన్సాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్లాదం.. బహుదూరం!



మహావీర్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న లే -అవుట్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం

- అధ్వానంగా పల్లె, పట్టణ ప్రకృతి వనాలు
- నిర్వహణ కరువై ఎడారిలా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

వికారాబాద్ అర్బన్: ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో పల్లెల్లో, పట్టణాల్లో ప్రభుత్వం ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రకృతి వనాలు అధ్వానంగా కనిపిస్తున్నాయి. సరైన నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రకృతి వనాలు ఎడారిని తలపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం వికారాబాద్‌లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో లక్ష్యం నెరవేరడం లేదు. హరితహారంలో భాగంగా పట్టణ శివారు లే అవుట్లలో పార్కు స్థలాలను ప్రకృతి వనాలుగా మార్చారు. మొక్కల సంరక్షణ కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మొక్కల పెంపకం వాటి సంరక్షణ కోసం రూ. 2.50 లక్షలు ఖర్చు చేసినట్లు సమాచారం. ఇలా ప్రతి ఏటా పట్టణ ప్రకృతి వనాల్లో మొక్కుబడిగా మొక్కలు నాటుతున్నారే తప్ప వాటి సంరక్షణను గాలికొదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. హరితహారంలో మొక్కలు నాటినట్లు లెక్కలు చూపడానికి మాత్రమే పట్టణ ప్రకృతి వనాలు ఉపయోగపడుతున్నాయనే విమర్శ లేకపోలేదు. ఈ హరితహారంలోనైనా పట్టణ ప్రకృతి వనాలు పచ్చగా మారుతాయా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రకృతి వనాలను అభివృద్ధి చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- మర్పల్లిలో బీజేపీ కార్యకర్తల సమావేశం



మర్పల్లి: బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మర్పల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎంపీ, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మర్పల్లిలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో బూత్ కమిటీ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి చేరేవిధంగా బూత్ కమిటీ సభ్యులు పనిచేయాలని ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలని కోరారు. అనంతరం తమిళనాడుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సెల్వకుమార్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలపై బూత్ కమిటీ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బన్నే మల్లేశ్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బస్వలింగం, జిల్లా నాయకులు బలరాం గౌడ్, మండల నాయకులు బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లు చూడతరమా..!

మండలంలోని పలు గ్రామాల్లో చిన్నపాటి వర్షాలకే అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. సీసీ రోడ్లు నిర్మించినా అంతర్గత రోడ్లు బురదమయం అవుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని క్యాద్గిరా, గంగ్వార్, ఇస్మాయిల్‌పూర్‌తండా, కంసాన్‌పల్లి(బి), ఎక్మాయి, నవల్గా, హంక్యానాయక్, బాబునాయక్‌తండా, కాశీంపూర్, మైల్వార్, కంసాన్‌పల్లి తదితర గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. మురికి నీరు రోడ్లపై నిలువడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. గ్రామ సర్పంచులైనా తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– బషీరాబాద్



డ్రైనేజీ లేక ఇళ్ల మధ్యే మురుగు



కంసాన్‌పల్లిలో గ్రామంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

శంకర్‌పల్లి: ప్రేమ విఫలమై ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రవణ్ చౌహాన్(20) నగరంలోని కొండాపూర్ ప్రాంతంలోని హఫీజ్‌పేట్‌లో నివాసం ఉంటున్నాడు. మోకిల శివారులోని కాశ్మీరీ విల్లాలో టైల్స్ పనులు చేసేందుకువచ్చేవాడు. శనివారం సాయంత్రం వరకు పనులు చేసుకున్నాడు. సాయంత్రం అక్కడే బిల్డింగ్‌పై ఉన్న సోలార్ రాడ్‌కు షార్ట్‌తో ఉరేసుకున్నాడు. గమనించిన కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేశ్ కుమార్ తెలిపారు.

టిప్పర్ కింద పడి యువకుడి దుర్మరణం

శంకర్‌పల్లి: టిప్పర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలో చిన్న శంకర్‌పల్లి చెందిన అనిల్‌కుమార్‌గౌడ్(33) టిప్పర్ల యజమాని వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. రామంతపురం నుంచి చేవెళ్లకు నిర్మిస్తున్న లింక్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజాము వరకు వాహనాల లోడ్‌లను లెక్కించి అదే పరిసరాల్లో నిద్రించాడు. గమనించని ఓ టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని వెనక్కు తీస్తున్న క్రమంలో వాహనం అనిల్‌గౌడ్ మీదుగా వెళ్లింది. దీంతో తీవ్రగాయాల పాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య జ్యోతి, కూతురు భవార్షిత, కుమారుడు హర్షిత్ గౌడ్ ఉన్నారు. భార్య పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్‌పల్లి పోలీసులు తెలిపారు.

ఆంగ్ల అధ్యాపకురాలు విజయలక్ష్మికి డాక్టరేట్

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేస్తున్న శ్రీమతి పాగుల విజయలక్ష్మి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పట్టా పొందారు. ట్రావెర్సింగ్ మల్టీపుల్ వరల్డ్స్, ఏ స్టడీ ఆఫ్ ది సెలెక్టెడ్ నావెల్స్ ఆఫ్ అనితారావు బాదామి, మోనికా అలీ అండ్ చందాని లోకుగే అంశంపై ఆచార్య అనిల్‌కృష్ణ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. అంతర్జాతీయ, ప్రఖ్యాత జాతీయ జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ పట్టా పొందిన విజయలక్ష్మిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు, అధ్యాపక బృందం, సిబ్బంది అభినందించారు.

దేశంలో పౌష్టికాహార ఉద్యమం రావాలి

శంషాబాద్ రూరల్: శక్తిమంతమైన భారతదేశానికి పౌష్టికాహార (న్యూట్రిషినిజం) ఉద్యమం చాలా అవసరమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వరాజ్యం కోసం దేశ భక్తి ఉద్యమం సాగితే.. సురాజ్యం దిశగా పయనం సాగిస్తున్న దేశానికి ప్రస్తుతం పౌష్టికాహార ఉద్యమం కావాలన్నారు. ఈ దిశగా దేశ ప్రజలంతా ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. స్థూలకాయం, అధిక రక్తపోటు, మధుమేహం లాంటి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు పౌష్టికాహారం పట్ల అవగాహన పెంచడానికి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తాజా పండ్లు, తృణధాన్యాలు, చిరుధాన్యాలు రోజూవారీ ప్రధాన ఆహారంగా తీసుకుంటే మంచి పోషకాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం ట్రస్టులో స్వయం ఉపాధి శిక్షణ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఉమ, స్వర్ణ భారత్ ట్రస్టు హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి బి.సుబ్బారెడ్డి, మెడికవర్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణారెడ్డి, సీఆర్‌పీఎఫ్ మాజీ డీజీ కె.దుర్గాప్రసాద్, ముప్పవరపు ఫౌండేషన్ ట్రస్టీ ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో.. ముదిరాజ్‌లకు గుర్తింపు లేదు



కందనెల్లిలో మాట్లాడుతున్న భూపతి ముదిరాజ్

- తాండూరులో ముదిరాజ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తాం
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి ముదిరాజ్
- కందనెల్లిలో సంఘం ఆత్మీయ సమ్మేళనం

పెద్దేముల్: సీఎం కేసీఆర్ పాలనలో ముదిరాజ్‌లకు గుర్తింపు లేదని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రోట భూపతి ముదిరాజ్ విమర్శించారు. ఆదివారం పెద్దేముల్ మండల కందనెల్లి గ్రామంలో ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి 70 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రాజకీయ పార్టీ జనాభా ప్రకారం ఎమ్మెల్యే సీట్లు కేటాయించలేదన్నారు. తెలంగాణ కోసం సుమారు 86 మంది ముదిరాజ్‌లు ప్రాణ త్యాగాలు చేసినా సరైన గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. బలం, బలగం ఉన్న ముదిరాజ్‌లు వచ్చే ఎన్నికల్లో సుమారు 17నుంచి 18 మంది ఎమ్మెల్యేలుగా చట్ట సభలకు వెళ్లడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని 119 లోక్ సభ సీట్లలో తాండూరు నుంచి ముదిరాజ్ ఎమ్మెల్యే గెలువబోతున్నారని తెలియచేశారు. ముదిరాజ్‌లను గ్రూపు– డీ నుంచి ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 96 కులాలు ఉండగా సీఎం కేవలం 19కులాల వారికే న్యాయం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ముదిరాజ్‌లను కించపర్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయనపై రౌడీ షీట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్యే ఎర్ర సత్యం ముదిరాజ్ ఎదగనీయకుండా ఆయనపై దాడులు చేసి చంపారని, అదే విధంగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హత్యకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ముదిరాజ్‌లు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా మద్దతివ్వాలని సూచించారు. అనంతరం రాష్ట్ర, జిల్లా నాయకులు లొంక నర్సింలు, వీరప్ప ముదిరాజ్‌లు అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర , జిల్లా నాయకులు చొప్పరి శంకర్ ముదిరాజ్, జగన్ మోహన్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, జిల్లా యువజన అధ్యక్షులు లొంక నర్సిములు, నరేష్‌మహరాజ్, ఉత్తమచందు, గజ్జల రాజు(రాజన్న), చంద్రశేఖర్ ముదిరాజ్, న్యాయవాది శ్రీనివాస్, అంజప్ప, ఎంపీడీఓ లక్ష్మప్ప ముదిరాజ్, నారాయణ, హన్మంతు, రాములు, జర్నప్ప తదితరులు పాల్గొన్నారు.

భర్తతో గొడవపడిన మహిళ అదృశ్యం



విజయలక్ష్మి(ఫైల్)

మొయినాబాద్: భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రాజేశ్, విజయలక్ష్మి భార్యాభర్తలు, వీరికి కొడుకు, కూతురు సంతానం. కాగా శనివారం విజయలక్ష్మి భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించేదు. దీంతో ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

చేవెళ్లలో నవ వధువు..



పద్మ (ఫైల్)

చేవెళ్ల: నాలుగు నెలల క్రితం వివాహమైన నవ వధువు అదృశ్యమైంది. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల గ్రామానికి చెందిన ఎల్మెల మహిపాల్‌కు పద్మతో నాలుగు నెలల క్రితం వివాహమైంది. జూన్ 30న కుటుంబ సభ్యులు పొలం పనులు వెళ్లారు. అనంతరం పద్మ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆమెకోసం బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఆమె భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సొంతూరుకు బయలు దేరిన మహిళ..



లలిత(ఫైల్)

మొయినాబాద్: సొంతూరుకు వెళ్తానని బయలుదేరిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం శక్కన్‌నగర్ గ్రామానికి చెందిన గడప లలిత కుటుంబం కొంతకాలంగా మొయినాబాద్‌లో నివాసముంటుంది. శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో లలిత శక్కన్‌నగర్‌కు వెళ్లేందుకు మొయినాబాద్ నుంచి బయలుదేరింది. ఆమె వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో కొడుకు నితిన్‌కుమార్ శనివారం రాత్రి తన మిత్రుడు వంశీకి ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నాడు. లలిత అక్కడికి రాలేదని చెప్పడంతో పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి ఉత్సవాలు



భక్తులకు ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి



హాజరైన భక్తులు

కందుకూరు: గురు పౌర్ణమిని పురస్కరించుకుని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారం రెండో రోజు ఘనంగా జరిగాయి. ఉదయం శివలింగానికి, శ్రీనిఖిలేశ్వరానందస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు విశేష సాధనలు ఇచ్చి వారితో జపాలు చేయించారు. అంతకుముందు గణపతి, గురు మంత్ర హోమం నిర్వహించారు. అనంతరం గురూజీ భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వాదాలు అందించి ప్రవచనాలు చేశారు. ప్రతి నిత్యం సాధన చేస్తే భగవంతుడి కృపకు పాత్రులు అవుతారన్నారు. సాధనలతో అన్ని పనులు సుసాధ్యమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ సాధనా మార్గంలో పయనిస్తూ తోటి వారితో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. నృత్యాలు, భక్తి గీతాలు, భాగవతం తదితర నాటికలతో కళాకారులు ఆకట్టుకున్నారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

దేశానికి క్రీడాకారులను అందించడమే లక్ష్యం

చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి

గచ్చిబౌలి: దేశానికి అవసరమయ్యే క్రీడాకారులను అందించడమే తెలంగాణ లక్ష్యమని చేవెళ్ళ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోని స్విమ్మింగ్ కాంప్లెక్స్‌లో ప్రతిష్టాత్మకమైన 76వ సీనియర్ నేషనల్ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గాంధీ, శాట్స్ చైర్మన్ డాక్టర్ అంజనేయగౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకంగా క్రీడాపాలసీని సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 18వేల గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను నిర్మించామన్నారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మినీ స్టేడియాలను నిర్మిస్తున్నామన్నారు. దేశానికి, రాష్ట్రానికి పేరు తెస్తున్న క్రీడాకారులను గుర్తించి వారికి నగదు బహుమతి, విలువైన ప్రదేశాలలో ఇంటి స్థలాలను అందచేస్తుందన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్), తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు 5వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ పోటీలలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 మంది జాతీయ స్థాయి ప్రముఖ క్రీడాకారులతో పాటు 100 మంది ప్రముఖ క్రీడాకారులు పాల్గొంటున్నారు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్లోళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేష్, హోప్ ఫౌండేషన్ చైర్మన్, చీఫ్ ప్యాట్రన్ కొండావిజయకుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం

- సీఎంను అభ్యర్థించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- చర్యలు చేపట్టిన పోలీసుశాఖ
- ఏర్పాటుకు అధికారుల ప్రతిపాదనలు



ఆమనగల్లు పోలీస్ స్టేషన్

ఆమనగల్లు: పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అభ్యర్థించారు. దీంతో ఏసీపీ కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. శాసనసభ ఎన్నికల ముందే ఏసీపీ కార్యాలయ ఏర్పాటుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

ఐదు మండలాలతో..

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలు రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి. కొత్తగా మాడ్గుల మండలంలోని సగం గ్రామాలతో ఇర్విన్ మండలం ఏర్పాటై ఆరెంది. ఐదు మండలాలతో ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాలు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండగా మాడ్గుల మండలం రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉంది. మాడ్గుల మండలాలు షాద్‌నగర్ ఏసీపీ పరిధిలో, మాడ్గుల మండలం ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో కొనసాగుతున్నాయి.

ఒకే కమిషనరేట్ పరిధిలోకి..

నాలుగు మండలాలు రెండు పోలీసు కమిషనరేట్ల పరిధిలో ఉండటంతో పాలనాపరంగా ఇబ్బందులు కలుగుతున్నాయి. రెండు కమిషనరేట్లు ఉండటంతో ప్రజా ప్రతినిధులకు కూడా ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో కల్వకుర్తి నియోజక వర్గ పరిధిలోని అన్ని మండలాలను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి తీసుకువచ్చి ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని చాలాకాలంగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పోలీసుశాఖ ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయానికి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రెండు ఎకరాల భూమిని కేటాయించాలని ప్రతిపాదనలు పంపించారు. ఏసీపీ కార్యాలయ ఏర్పాటు దిశగా చర్యలు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.